తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

- 'మే' లోపు సుంకేసుల–మునగాలపాడు పైప్‌లైన్ పనులు పూర్తి
- కల్లూరులో మరింత మెరుగ్గా నీటి సరఫరాకు శ్రీకారం
- మేయర్ బీవై.రామయ్య, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు నగర మేయర్ బీవై రామయ్య స్పష్టం చేశారు. హంద్రీ–నీవా కాలువ నుంచి టిడ్కో సమీపంలోని ప్రెషర్ ఫిల్టర్ మీదుగా 27వ వార్డు అబ్బాస్‌నగర్ సంప్‌కు అక్కడి నుంచి కల్లూరులోని వివిధ ఓవర్ హెడ్ ట్యాంకులకు నీటిని సరఫరా చేసే ప్రక్రియను మేయర్‌తో పాటు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ శ్రీకారం చుట్టారు. ఆదివారం అబ్బాస్‌నగర్ నగరపాలక సంస్థకు చెందిన సంపు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మోటార్ బటన్ నొక్కి నీటి సరఫరాను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. టిడ్కో ఇళ్ల నుంచి అబ్బాస్‌నగర్ సంపు వరకు ఉన్న పైపులైన్‌ను వాడుకొని కల్లూరు ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. సుంకేసుల నుంచి మునగాల పాడు



అబ్బాస్‌నగర్ సంపు వద్ద తాగునీటి సరఫరాను ప్రారంభిస్తున్న మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కమిషనర్ భార్గవ్‌తేజ తదితరులు

వద్ద ఉన్న స్టోరేజ్ ట్యాంకు వరకు రూ.82 కోట్లు వెచ్చించి నిర్మిస్తున్న పైపులైన్ పనులు వచ్చే మే నెల లోపు పూర్తి చేస్తామన్నారు. దీని వల్ల నూతనంగా ఏర్పడిన కాలనీల్లో తాగునీటి సమస్యకు పరిష్కారం లభించిందన్నారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. కల్లూరు అర్బన్‌లో రోజురోజుకు కాలనీల సంఖ్య పెరుగుతోందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకుంటున్నట్లు చెప్పారు. హంద్రీ–నీవా కాలువ నుంచి వస్తున్న నీటి ద్వారా కల్లూరు అర్బన్‌లోని 26, 27 వార్డుల్లో నీటి సరఫరా మరింత మెరుగుపడుతుందన్నారు. నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ మాట్లాడుతూ.. కల్లూరు అర్బన్‌లో అదనంగా మరో 3 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేయడం ద్వారా దాదాపు 30 వేల మంది ప్రజలు నీటిని వినియోగించుకునే అవకాశం ఏర్పడిందన్నారు. ప్రజలకు మెరుగైన తాగునీటిని అందించేందుకు, పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు కల్పించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకున్నామన్నారు. రాబోయే వేసవి కాలంలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. అలాగే నగరంలోని అన్ని వార్డుల్లో పెద్ద ఎత్తున మురుగు కాల్వల నిర్మాణం, కల్వర్టుల నిర్మాణం, సీసీ డ్రైన్లు వంటి పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. స్టాండింగ్ కమిటీ సభ్యులు సాన శ్రీనివాసులు, కార్పొరేటర్లు శ్వేతారెడ్డి, సుదర్శన్ రెడ్డి, లక్ష్మీకాంత రెడ్డి, చిన్న నరసింహులు, జయరాముడు, లక్ష్మీరెడ్డి, నారాయణ రెడ్డి, ఎస్ఈ శేషసాయి, డీఈఈ రవిప్రకాష్ నాయుడు, ఏఈ జనార్ధన్, కర్నాటి పుల్లారెడ్డి, సాపూరు వీరయ్య, సాయి పాల్గొన్నారు.

సేవాభావంతో ముందుకెళ్లాలి

కర్నూలు(అర్బన్): యువజన, కుల, ప్రజా సంఘాలు సేవాభావంతో ముందుకు వెళ్లాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య కోరారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జరిగిన ఎంఆర్‌పీఎస్ యువజన విభాగం సర్వసభ్య సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఎంఆర్‌పీఎస్ యువజన విభాగం విధి విధానాలను కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మేయర్‌ను ఆ విభాగం నేతలు ఘనంగా సన్మానించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు విజయ్ కుమార్‌రెడ్డి, సంఘం వ్యవస్థాపక గౌరవ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏసన్న, జిల్లా అధ్యక్షులు కృష్ణ మూర్తి, అయ్యస్వామి, చిన్న సూరి అంజి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామిరెడ్డి తాత ఆరాధనోత్సవాలు

కల్లూరు: అవధూత రామిరెడ్డి తాత సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. సోమవారం కల్లూరులో సేవ సంస్థాన్ అధ్యక్షుడు దాసరి రామచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరాధనా మహోత్సవాల ప్రారంభ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా తాత విగ్రహానికి పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించి సమాధిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. స్వామి వారి చిత్రపటాన్ని పల్లకీపై ఉంచి భజనలు చేస్తూ, కోలాటాలు, నృత్యాలు మధ్య కల్లూరు పురవీధుల గుండా ఊరేగించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కల్లూరులో జన్మించిన దత్తాంశ సంభూతుడైన రామిరెడ్డి తాత ఈ ప్రాంతాన్ని పావనం చేశాడన్నారు. టీడీపీ పాణ్యం ఇన్‌చార్జ్ గౌరు చరితా రెడ్డి, వెంకటరెడ్డి, బీజేపీ నేత బైరెడ్డి శబరిరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులందరికీ సేవా సంస్థాన్ సభ్యులు అన్నదానం చేశారు. కార్పొరేటర్లు మైతాపు నరసింహులు, సాన శ్రీనివాసులు, దండు లక్ష్మీకాంత రెడ్డి, ఎరుకల వెంకటేశ్వర్లు, సంస్థాన్ కోశాధికారి హనుమంతురెడ్డి, పీఠాధిపతులు సుబ్రహ్మణ్యం, ఎల్లప్ప స్వామి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

18న కర్నూలు మండల సర్వసభ్య సమావేశం

కర్నూలు (న్యూటౌన్): ఈ నెల 18వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు కర్నూలు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్.భాస్కర్ నాయుడు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా కోడుమూరు శాసన సభ్యులు డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హాజరవుతారని పేర్కొన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్ లు, మండల, గ్రామ స్థాయిలోని అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

22 నుంచి రాజశ్యామల నవరాత్రులు

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఈనెల 22వ తేదీ నుంచి 20వ తేదీ వరకు రాజశ్యామల నవరాత్రులు నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ తెలిపారు. మహా గౌరీ అమ్మవారికి శ్రీ విద్య సంప్రదాయానుసారంగా నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాజ శ్యామల సహస్రనామం, శ్రీ లలితా సహస్రనామ అర్చనలు, పారాయణం ఉంటుందని వెల్లడించారు.

18న గోదా రంగనాథ స్వామి కల్యాణం

కర్నూలు కల్చరల్: విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీన గోదా రంగనాథ స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు వీహెచ్‌పీ ఆరామలయ ప్రఖండ కార్యదర్శి గిరిబాబు తెలిపారు. ఓల్డ్‌సిటీలోని గీతా మందిరంలో సాయంత్రం 5 గంటలకు కల్యాణం జరుగుతుందని పేర్కొన్నారు. వీహెచ్‌పీ కేంద్రీయ కార్యకారిణి సదస్యులు వై.రాఘవులు ప్రధాన వక్తగా హాజరై సందేశమిస్తారని పేర్కొన్నారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడగలం



రక్తదానం చేస్తున్న యువకుడిని అభినందిస్తున్న ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ఆపదలో ఉన్న వారికి చేసే రక్తదానం విలువైన ప్రాణాలు నిలుపుతుందని మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి చెప్పారు. అజ్వా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఓల్డ్‌సిటీలోని ఐడియల్ ఇంగ్లిష్ స్కూల్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం రక్తదాతలను ఎస్వీ మోహన్‌రెడ్డి అభినందించారు. సొసైటీ అధ్యక్షులు నజ్జీద్‌బాషా పట్టాన్, ఉపాధ్యక్షులు షేక్ నాసిర్‌హుసేన్, సెక్రటరీ షేక్ షబ్బీర్, జాయింట్ సెక్రటరీ షేక్షా, ట్రెజరర్ వాహిద్ బాషా పాల్గొన్నారు.

ఆర్‌యూపీపీ క్యాలెండర్ ఆవిష్కరణ

కర్నూలు సిటీ: రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ (ఆర్‌యూపీపీ), ఏపీటీఎఫ్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘాల నూతన సంవత్సర క్యాలెండర్లను ఆదివారం వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ చామల అనిల్ వెంకట ప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు, ఆర్‌యూపీపీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రఘు, నాగేంద్రుడు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జోసెఫ్ లక్ష్మయ్య, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇస్మాయిల్, మరియానందం పాల్గొన్నారు.

గోవులే నిజమైన సంపద

కర్నూలు కల్చరల్: గో సంపదే భారతీయులకు నిజమైన సంపద అని లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి అన్నారు. కనుమ పండుగ పురస్కరించుకొని సోమవారం ఓల్డ్ సిటీ లోని లలితా పీఠంలో ఘనంగా గోపూజ నిర్వహించారు. అంతకుముందు రాఘవేంద్ర సత్సంగం ఆధ్వర్యంలో కోలాటం, భజనలతో శోభాయాత్ర నిర్వహించారు. డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు



ఎస్‌వీసీ కాంప్లెక్స్ : వీర సింహారెడ్డి, వాల్తేర్ వీరయ్య, వారసుడు, తెగింపు, కల్యాణం కమనీయం
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : వీర సింహారెడ్డి, వాల్తేర్ వీరయ్య, వారసుడు, తెగింపు, కల్యాణం కమనీయం,ధమాకా
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : వీర సింహారెడ్డి, వాల్తేర్ వీరయ్య , వారసుడు
ఐనాక్స్ : అవతార్ ది వే ఆఫ్ వాటర్, వాల్తేరు వీరయ్య , ఎమ్‌త్రీగన్, వీరసింహారెడ్డి
భరత్ కాంప్లెక్స్ : వీర సింహారెడ్డి, వాల్తేర్ వీరయ్య
రాజ్ : వీర సింహారెడ్డి
శ్రీరామ,విజయ : వాల్తేర్ వీరయ్య

నీలం సాయినగర్‌లో భారీ చోరీ



బీరువా పగులగొట్టి చోరీ చేసిన దృశ్యం

కర్నూలు: కర్నూలు శివారులోని పెద్దపాడు రోడ్డులో గల నీలం సాయినగర్‌లో భారీ చోరీ జరిగింది. వడ్డె సురేష్‌కుమార్ అనే వ్యక్తి సౌదీ అరేబియాలో ఉద్యోగం చేసి ఇటీవల కర్నూలులోని నీలం సాయి నగర్‌లో నివాసముంటున్నాడు. మూడు రోజుల క్రితం సంక్రాంతి పండుగ కోసం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలసి స్వగ్రామం హెచ్.కై రవాడికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు మెయిన్ డోర్‌కు వేసిన తాళాలు పెకిలించి లోపలికి వెళ్లి పడక గదిలో ఉన్న బీరువాను బద్దలుకొట్టి అందులో ఉన్న 10 తులాల బంగారం, 50 తులాల వెండి, రూ.3 లక్షల నగదు మూటగట్టుకుని ఉడాయించారు. సురేష్ కుమార్ సోమవారం ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరచివున్నాయి. గదిలోకి వెళ్లి చూడగా బీరువాలోని సామాన్లన్నీ చిందరవందరగా పడి ఉండటంతో చోరీ జరిగిందని నిర్ధారించుకుని పోలీసులకు సమాచారమిచ్చారు. నాలుగవ పట్టణ ఎస్‌ఐ మోహన్‌కిషోర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలను సేకరించారు. బాధితుడు సురేష్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దొంగల కోసం గాలిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అపార్ట్‌మెంట్ పైనుంచి పడి రిటైర్డ్ వైద్యుడు మృతి



మృతిచెందిన రామకృష్ణ శాస్త్రి

కర్నూలు: కర్నూలు నగరం రాజేశ్వరి నగర్‌లో నివాసముంటున్న రిటైర్డ్ ఈఎన్‌టీ డాక్టర్ రామకృష్ణ శాస్త్రి (70) అపార్ట్‌మెంట్ రెండవ అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కింద పడి మృతిచెందాడు. ఈయన హైదరాబాద్ మల్కాజ్‌గిరిలోని ప్రభుత్వ వైద్యశాలలో ఈఎన్‌టీ డాక్టర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందాడు. ఈయనకు కొడుకు, కూతురు సంతానం. కుమారుడు నాగ సాయిరాంతో కలిసి కర్నూలులోని తేజ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నాడు. సోమవారం ఉదయం రెండవ బ్లాక్‌లోని మెట్లపై నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌కు దిగుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కుమారుడు నాగసాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మూడవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించారు. ప్రమాదం జరిగిన తీరుపై విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

నాటుసారా స్థావరాలపై సెబ్ దాడులు

కర్నూలు: కర్నూలు నగరం బంగారుపేటలోని నాటుసారా స్థావరాలపై సెబ్ అధికారులు దాడులు నిర్వహించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్న సెబ్ అడిషనల్ ఎస్పీ క్రిష్ణకాంత్ పటేల్ ఆదేశాల మేరకు కర్నూలు డీటీఎఫ్, సెబ్‌స్టేషన్, విజయవాడ ఎస్టీఎఫ్ సిబ్బంది సమష్టిగా సోమవారం దాడులు చేశారు. నాటుసారా బట్టీలను ధ్వంసం చేసి నీలిషికారి నాగరాజు ఇంట్లో దాచి ఉంచిన 200 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. అలాగే నీలిషికారి జబ్బమ్మ, సోనా, సురేష్ సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకుని 45 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. నాటుసారా తయారీ, విక్రయాలు మానుకోకపోతే పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని కర్నూలు సెబ్ స్టేషన్ సీఐ సత్యనారాయణ హెచ్చరించారు.



బంగారుపేటలో నాటుసారా బట్టీలను ధ్వంసం చేస్తున్న సెబ్ సిబ్బంది

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు నగరంలో మంగళవారం చేపట్టే నిర్వహణ, మరమ్మతు పనుల కోసం విద్యుత్ కోతలు విధించనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ టౌన్ ఈఈ రమేష్, కర్నూలు–1, రూరల్స్, ఏడీఈలు రాజమోహన్‌రెడ్డి, సుబ్బన్న, సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్బైట్స్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న 220 కేవీఏ సబ్‌స్టేషన్ నుంచి 132 కేవీఏ సబ్‌స్టేషన్ల మధ్య రైల్వే ట్రాక్‌పై ట్రాన్స్‌కో టవర్ హై పవర్ లైన్‌ను ఎత్తు పెంచేందుకు పనులు జరుగుతున్న కారణంగా సబ్ డివిజన్ల పరిధిలోని జొహరాపురం, ఉస్మానియా, వార్త కార్యాలయం, శరీన్‌నగర్, జీ.పుల్లారెడ్డి, ఆర్‌సీఎస్, ఇండస్ట్రీయల్, ఎస్టేట్, మిలటరీ కాలనీలోని 33 కేవీఏ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న ఖడక్‌పురా మైదానం, ఉస్మానియా కళాశాల ఏరియా, మాసుంబాషా దర్గా, గాయత్రి ఎస్టేట్, గాయత్రి ఎస్టేట్, బిర్లాగడ్డ, ఈూగూర్ నగర్, లక్ష్మీ నగర్, మద్దూర్ నగర్, బీ.క్యాంప్, సీ.క్యాంప్, గణేష్ నగర్, రెవెన్యూ కాలనీ, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ కాలనీ, సాయి వైభవ్ నగర్, నంద్యాల చెక్ పోస్టు ఏరియా, శేషాద్రీ నగర్, పోస్టల్ కాలనీ, మారుతి మెగా సిటీ, బృందావన్ నగర్, మారుతి నగర్, అరుంధతి నగర్, టెలికాం నగర్, గఫూర్ నగర్, పార్థసారధీ నగర్, కమలానగర్, రామచంద్రనగర్, రామకృష్ణ నగర్, గుత్తి రోడ్డు, శరీన్ నగర్, అబ్బాస్ నగర్, కృష్ణానగర్, పాతబస్తీ, జొహరాపురం, ఇందిరమ్మ కాలనీ, మిలటరీ కాలనీ, గార్గేయపురం, దిగువపాడు, శివరాంపురం తదితర కాలనీలు, చుట్టు పక్కల ప్రాంతాల్లో మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సంస్కృతి, సంప్రదాయాల కలయిక సంక్రాంతి





శరీన్‌నగర్‌లో ముగ్గుల పోటీ విజేత రామలక్ష్మికి టీవీ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని, మేయర్ బీవై రామయ్య, కల్లూరులోని శరీన్‌నగర్‌లో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

కల్లూరు: సంస్కృతి, సంప్రదాయల కలయిక సంక్రాంతి అని వైఎస్సార్‌సీపీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు, మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. జిల్లావ్యాప్తంగా మకర సంక్రాంతి, కనుమ సంబరాలు ఘనంగా జరిగాయి. కల్లూరు అర్బన్ 29వ వార్డులో సోమవారం సాయంత్రం కార్పొరేటర్ సంగాల సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో శరీన్ నగర్‌లోని వైఎస్సార్ సర్కిల్ వద్ద ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల చూడముచ్చటైన ముగ్గులు వేశారు. ముగ్గుల పోటీల జడ్జిలుగా డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, 41వ వార్డు కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి, నాగరత్నమ్మ వ్యవహరించారు. ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య ముగ్గులను పరిశీలించి విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి రామలక్ష్మి (టీవీ), తరువాతి స్థానాలకు అరుణకుమారి (కుట్టు మిషన్), సరస్వతి (గ్రైండర్), నాగలక్ష్మి (మిక్సీ), జానకి (ఫ్యాన్) అందుకున్నారు. పోటీల్లో పాల్గొన్న వారందరికీ ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్పొరేటర్లు దండు లక్ష్మీకాంతరెడ్డి, ఎరుకల వెంకటేశ్వర్లు, కాశపోగు జయరాముడు, ఇప్పల నారాయణరెడ్డి, విక్రమ సింహారెడ్డి, లక్ష్మీరెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివ శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



'సంక్రాంతి సంబరాలు' కార్యక్రమానికి హాజరైన మహిళలు

- కల్లూరు అర్బన్ 36వ వార్డులో ఆదివారం సాయత్రం డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, వార్డు ఇన్‌చార్జ్ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు.
- ఉలిందకొండ, కె.మార్కపురం గ్రామాల్లో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉలిందకొండలో ముగ్గుల పోటీతో పాటు, గాలిపటం పోటీలు, స్లోసైకిల్ పోటీలను నిర్వహించారు. విజేతలకు మాజీ ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు.

22న ఏ షామ్ మస్తానీ

కర్నూలు కల్చరల్: ఆర్‌ఆర్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు అంబేడ్కర్ భవన్‌లో ఏ షామ్ మస్తానీ పేరుతో మ్యూజికల్ నైట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, సింగర్ రాణి తెలిపారు. ప్రముఖ గాయనీ గాయకులు అర్షద్, లత, అమిర్, చాంద్‌బాష, జయపాల్, సుధాకర్, దస్తగిర్ బాష మ్యూజికల్ నైట్‌లో ప్రసిద్ధ పాటలు ఆలపిస్తారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ మహబూబ్ బాసా అతిథులుగా హాజరు కానున్నట్లు తెలిపారు. సంగీత అభిమానులందరూ పాల్గొనవచ్చన్నారు.

రైలు కింద పడి వృద్ధురాలు ఆత్మహత్య

కర్నూలు: కర్నూలు రైల్వేస్టేషన్ శివారులోని అలంపూర్‌కు వెళ్లే దారిలో 240/4.5 కిలోమీటర్ వద్ద రైలు కింద పడి గుర్తు తెలియని వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. సోమవారం మధ్యాహ్నం ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు అనుమానిస్తున్నారు. మృతురాలి వయసు50 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉంటుందని, ఎత్తు 5 అడుగులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కర్నూలు రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ కె.వై.సంజన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు రైల్వే ఎస్‌ఐ సురేష్ బాబు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మృతురాలు లేత గులాబీ రంగు చలి కోటు, వంకాయపూత రంగు జాకెట్, ముదురు వంకాయ పూత రంగు, తెల్లటి ఆకుపచ్చ డిజైన్ ఉన్న చీర ధరించింది. మృతురాలికి సంబంధించిన వివరాలు తెలిసినవారు 94407 56043 నంబర్‌ను సంప్రదించాలని ఎస్‌ఐ సురేష్ బాబు కోరారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు



గోపూజ చేస్తున్న భక్తులు



జర్మనీలోని డుస్సెల్ డోర్ఫ్ నగరంలో సంక్రాంతి సంబరాలు

కర్నూలు కల్చరల్: సంక్రాంతి పర్వదినం సంబరాలు అంబరాన్నంటాయి. ఆదివారం మకర సంక్రాంతి, సోమవారం కనుమ పండుగలను విశేషంగా జరుపుకున్నారు. ఇంటి ముంగిళ్లల్లో యువతులు, మహిళలు ఇంద్ర ధనుస్సులాంటి రంగవల్లులను తీర్చిదిద్దారు. ముగ్గుల్లో బంతి పూల గొబ్బెమ్మలను పెట్టి భక్తిశ్రద్ధలతో సంక్రాంతి లక్ష్మికి స్వాగతం పలికారు. గోపూజ చేశారు. హరిదాసులు కీర్తనలు ఆలపిస్తూ వీధుల్లో సందడి చేశారు. గంగిరెద్దుల విన్యాసాలు ప్రత్యేకంగా నిలిచాయి. చిన్నా పెద్ద తేడా లేకుండా గాలిపటాలను ఎగురవేస్తూ కేరింతలు కొట్టారు. వ్యవసాయంలో తమకు ఎంతో చేదోడుగా ఉండే పశువులకు పూజలు చేశారు. వాటికి కృతజ్ఞతా పూర్వకంగా శుభ్రంగా కడిగి పొంగలి నైవేద్యం పెట్టి పూజలు చేశారు. బసవన్నలను వీధుల్లో ఊరేగించారు.

జర్మనీలో సంబరాలు

కర్నూలు(అగ్రికల్చర్): తెలుగు వారి పెద్ద పండుగ సంక్రాంతి వేడుకలు దేశ విదేశాల్లో కనులపండవగా జరిగాయి. జర్మనీలోని డుస్సెల్ డోర్ఫ్ నగరంలో స్థిరపడిన తెలుగు వారు అక్కడ జరుపుకున్న సంక్రాంతి సంబరాల ఫొటోలు, వీడియోలు జిల్లాలోని బంధుమిత్రులకు షేర్ చేశారు. 400 మందికిపైగా తెలుగు వారు జర్మనీలో ఒక రోజంతా వేడుకలు నిర్వహించుకోవడం విశేషం. వీరిలో ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు రాయలసీమ జిల్లాలకు చెందిన వారు అనేక మంది ఉన్నారు. 20కిపైగా సాంస్కృతిక కార్యక్రమాలతో పల్లెటూరి వాతావరణంలో వేడుకలు నిర్వహించుకున్నారు. చిన్నారుల ఆటపాటలు, భరతనాట్యం, స్కిట్, ఎన్‌టీఆర్, ఏఎన్‌ఆర్, కృష్ణ, సావిత్రి తదితరుల రెట్రో నృత్యాలు, ఇంకా మరెన్నో కార్యక్రమాలు అద్భుతంగా జరిగాయి.

శోభాయమానంగా గోదా రంగనాథ కల్యాణం

కర్నూలు కల్చరల్: కర్నూలు నగర శివారు మామిదాలపాడు సమీపంలో వెలసిన గోదా గోకులంలో ధనుర్మాస ఉత్సవాల ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం అష్టాక్షరీ పీఠాధిపతులు శ్రీ త్రిదండి రామానుజ జీయర్‌స్వామి ఆశీస్సులతో వేద పండితులు గోదా రంగనాథ స్వామి వార్ల కల్యాణోత్సవాన్ని కనులపండుగలా నిర్వహించారు. అనంతరం స్వామి వారు అనుగ్రహ భాషణం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గోపూజ నిర్వహించారు. లలితా సహస్రనామ పారాయణం, గోదా విష్ణు సహస్రనామ పారాయణం, కోలాటం, భజనలు నిర్వహించారు. గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజు గుప్త, కమిటీ సభ్యులు పల్లెర్ల నాగరాజు, రవికుమార్, ద్వారకానాథ్, యడ్లపల్లి శివారెడ్డి, బాల సుధాకర్, టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కల్యాణమూర్తులుగా గోదా రంగనాథ స్వామివారు

బాలల దురలవాట్లపై ప్రత్యేక దృష్టి

కర్నూలు(రాజ్‌విహార్): బాలలు దురలవాట్లు, వ్యసనాలకు గురికాకుండా ప్రత్యేక దృష్టి సారించాలని నేషనల్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ రీసెర్చ్ (న్యూఢిల్లీ) మెంబర్ సెక్రటరీ రూపాలి బెనర్జీ సింగ్ సూచించారు. సోమవారం ఆమె ఢిల్లీలోని తన కార్యాలయం నుంచి ఆన్‌లైన్ ద్వారా బాలల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించారు. చిన్నారులు డ్రగ్స్, మద్యం, మాదక ద్రవ్యాలు వంటి దురలవాట్లకు గురి కాకుండా చూడాలన్నారు. సమావేశంలో స్త్రీ, శిశు సంక్షేమ, వైద్య ఆరోగ్య, విద్యా, పోలీసు, వివిధ శాఖల అధికారులు ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలతో ఆర్థిక భరోసా

కర్నూలు(రాజ్‌విహార్): పేదలకు ఆర్థిక భరోసా అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఎంఏ హఫీజ్‌ఖాన్ అన్నారు. సోమవారం ఆయన 10వ వార్డులో వివిధ శాఖల అధికారులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. బాబు గౌండ గల్లీ, లతీఫ్ లౌబాలి దర్గా స్ట్రీట్ ఏరియాల్లోని వీధుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరిస్తూ ప్రభుత్వం మూడేళ్లలో మంజూరు చేసిన పథకాలను వివరిస్తూ సంక్షేమ క్యాలెండర్‌ను అందించారు. ప్రజల సమస్యలు, ఇబ్బందులు తెలుసుకొని నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల కష్టాలను స్వయంగా చూసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వాటిని తొలగించేందుకు అనేక పథకాలు తీసుకొచ్చారని చెప్పారు. జగనన్న సీఎం అయ్యాక తొలి సంతకం పింఛన్ల పెంపుపైనే పెట్టారని, దీంతో పాటు ప్రతి వర్గానికి మేలు జరిగేలా పథకాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పథకాలను పారదర్శకంగా, అవినీతికి తావులేకుండా అందిస్తున్నట్లు వెల్లడించారు. ఎలాంటి సిఫార్సు లేకుండా అన్ని వర్గాల ప్రజలకు మంజూరు చేయడం తమ ప్రభుత్వానికే సాధ్యమైందన్నారు. స్థానిక కార్పొరేటర్ యూనుస్ బాషా, నాయకులు రేహాన్ అలీఖాన్, పర్వేజ్, నజీర్, నూరుల్లాఖాద్రీ, సోహెల్, బాబా, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, పాల్గొన్నారు.



10వ వార్డు లాల్‌దర్గా సమీపంలో వృద్ధురాలికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

హ్యాండ్‌బాల్ పోటీల్లో జిల్లాకు కాంస్యం

కర్నూలు (టౌన్): ఈనెల 13, 14 తేదీల్లో కృష్ణా జిల్లా గన్నవరంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ బాలుర పోటీల్లో కర్నూలు జిల్లా జట్టు కాంస్యం కైవసం చేసుకుంది. రాష్ట్రస్థాయిలో కాంస్య పతకం సాధించిన క్రీడాకారులను ఆంధ్రప్రదేశ్ హ్యాండ్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఒలంపిక్ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు సోమవారం అభినందించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో పతకం సాధించడంతో పాటు జాతీయ జట్టులో ముగ్గురు క్రీడాకారులకు అవకాశం రావడం హర్షించదగ్గ విషయమన్నారు.



కాంస్య పతకం సాధించిన కర్నూలు జట్టు